# శ్రీశైల రగడ

శ్రీ రమ్యంబుగ శ్రీ గిరి యాత్రకు | కూరిమి సతితో కూడి నడచితిని
పల్లెలు పురములు పట్టణంబులు | పేటలు దాటితి అడవులు కొండలు అన్నీ దాటితి
కంటిని శ్రీగిరి కన్నులనిండా | వింటిని మహిమలు వీనుల నిండా
ఆ మహిమలు నేనేమని చెప్పుదు | ఈ మహిలోపల ఎన్నడు చూడము
ధారుణి లోపల ధౌతాచలమది | మేరుని కంటెను మిక్కుటమైనది
బ్రహ్మ నిర్మల బహి శృంగంబులు | నిర్మలమగు మాణిక్య కూటములు
కోటలు కొమ్మలు గోపురంబులు | తెరపిలేని బహు దేవాలయములు
పుణ్యస్థలంబులు పుణ్యవనంబులు | వాటమైన పూదోటలు మిక్కిలి
మాటలు నేర్చిన మంచి మృగంబులు | కామధేనువులు కల్ప వృక్షములు
క్షేమ కరంబగు చింతామణులు | అమృత గుండంబులు
కడు నైష్ఠిక మును కలిగిన విప్రులు | విడువక శంభుని వేడెటి రాజులు
సంతత లింగార్చన గల శైవులు | శాంతులైన వేదాంతులు సిద్ధులు
ఘనఘన మ్రోగెటి ఘంటనాదములు | విజయ ఘోషయగు శంఖనాదములు
వీర శైవులూ వీరాంగంబులు | సాధు బృందములు కామిత భక్తులు అగరు ధూపములు
జపములు చేసెటి జంగమోత్తములు | తపములు చేసెటి తాపసోత్తములు
ప్రమధులు భక్తులు శైవ గణంబులు | గట్టిగ ఇది భూ కైలాశం అని
తప్పిపోక పాతాళ గంగలో | తెప్పున తేలుచు తీర్థంబాడుచు
చెలగుచు మడి వస్త్రంబులు కట్టితి | అనువుగ నుదుట విభూది ధరిస్తిని
పొదుపుగ మెడ రుద్రాక్షలు దాల్చితి
గురు కటాక్షమును గోప్యము చేసితి | గురు మంత్రంబును జపమును చేసితి
అకలంకుడనై ఆశ జయిస్తిని
శివ పంచాక్షరి మనసున నిలిపితి | శివ తత్వము పరిశీలన చేసితి
పంచేంద్రియంబులు పదిలము చేసితి | పంచ ముద్రలభ్యాసము చేసితి
అంతర్ముఖుడనైతిని | నాద బ్రహ్మ నాదము వింటిని | లోపల తుమ్మెద నాదము వింటిని
వెలుగులకెల్లా వెలుగై వెలెగెడు | ఆ లోపల దీపము కంటిని
ఈవల చంద్రుండావల సూర్యుడు | కలిగిన స్థావరమైన నిదానము కంటిని
కంటికి ఇంపగు పండు వెన్నెల | విరిసిన షట్కమలంబులు షష్ఠలంబులు
పిండాండములో బ్రహ్మాండము కంటిని

అంతట అక్కడ చెంగల్వ కొలనులో | ఆడుచున్న రాచంసను పట్టితి
చాల వేయి స్తంభాల మేడలో | బాలిక కూడుకు కేళి సలిపితిని
మల్లిఖార్జునిని మదిలో దలచితి | ముందర బృంగికి మ్రొక్కి వేడితిని
నందికేశ్వరుని నమ్మి భజించితి | చండీశ్వరునకు దండం పెట్టితి
మళ్ళీ మళ్ళీ మహిమను పొగడుచు | పెళ్ళారయ్యకు ప్రియముగ మ్రొక్కితి
ద్వార పాలకుల దర్శన మాయను | ద్వారమందు రతనాల గద్దెపై
చూచితి నెవ్వరు చూడని లింగం | చూచితి కేవల సుందర లింగం
నిరుపద్రవమగు నిశ్చల లింగం | ఆది తేజమగు ఐక్య లింగం
రాజితమైన విరాజిత లింగం | పూజనీయమగు పురాణలింగం
లింగము గనుగొని లింగ దేహినై | లింగాంగులతో లింగ నిర్గుణ సంగతి కంటిని
లింగమందు మదిలీనము చేసితి | జీవన్ముక్తుడనైతిని
అంకమందు భ్రమరాంబిక ఉండగ | మల్లిఖార్జునిని కోరి పూజించితి
దీపము పెట్టితి దివ్యదేహునకు | ధూపము వేసితి ధూర్జటి కప్పుడు
తుమ్మిపూలతో పూజిస్తిని | కమ్మని నైవేద్యము పెట్టితి
సాగిలి మ్రొక్కితి సర్వేశ్వరునకు | జయ జయ జయ జయ జంగమరాయ
ఆది దేవుడవు ఆత్మ శరణ్య | దయ తప్పక ధవళ శరీర | భయము బాపు మీ భక్త నిదాన
ఎన్ని జన్మములు ఎత్తిన వాడను | నిన్ను తలంపక నీచుడనైతిని
ఎన్నడు ఏ విధమెరుగని వాడను | దుష్ట మానసుడ గౌరీ రమణ
తామస గుణములు తగులాటంబులు | నియమము తప్పిన నీచవర్తనుడ | నిత్య దరిద్రుడ
ఆత్యాశయుడను అజ్ఞాన పశువును | చేయరాని దుశ్చేష్టలు చేసితి | బాయరాని మీ భక్తుల బాసితి
సంసారంబను సంకెళ్ళల్లో | హింస పెట్టమిక ఏలు మి తండ్రి
ముల్లోకంబులు ముంచెడి గంగను | సలలితముగా జడ దరియిస్తివి
గొప్ప చేసి నిను కొలిచిన భంటును | తప్పక చంద్రుని తల దరియిస్తివి
విన్నుని చేతను కన్ను పూజగొని | సన్నుతి కెక్కిన చక్ర మిచ్చితివి
ఆనక శైల కుమారిక కోరిన | సగము శరీరము ఇస్తివి
మూడు లోకముల ముఖ్యము నీవే | మూడు మూర్తులకు మూలము నీవే
దాతవు నీవే | భ్రాతవు నీవే | తల్లివి నీవే | తండ్రివి నీవే | బ్రహ్మము నీవే | సర్వము నీవే
పాలముంచు మిక నీట ముంచుమి | పాలబడితినో ఫాలలోచన
అనుచు ప్రణతుల నిడుచు ఇది చదివిన వారికి ||

ఫలశ్రుతి

కాలువలు త్రవ్వించి గన్నేర్లు వేసి | పూలు కోసి శివునకు పూజించిన ఫలము
గంగి గోవులు తెచ్చి ప్రేమతో సాకి | పాలు తీసి అభిషేకము చేసిన్న ఫలము
ఆకలితో నున్న అన్నార్తులకును | కమ్మనీ భోజనంబిచ్చిన ఫలము
భీతితో నున్నట్టి కడు దీనులకును | శరణిచ్చి రక్షించు విశేష ఫలము
అంతకన్నా ఫలము అధికమయ్యుండు.

Author: తరతరాలుగా నోటి పాటగా వస్తున్నది

Extracted from: శ్రీ చాగంటి కోటీశ్వర్రావు గారి శివ మహా పురాణం ప్రవచనం

Keywords: SrI chAganTi kOTESwara rAo gari Siva mahA purANa pravacanam, SrISaila ragaDa, Siva mahApurANa pravachanam nunDi SrISaila ragaDa, SrI giri yAtra, pallelu, puramulu, gangi gOvulu, SivuDu, SankaruDu, mallikArjunuDu